ప్రజాశక్తి
శనివారం 23 మార్చి, 2024
5
శ్రీకాకుళం

నిధి పోర్టల్ ద్వారానే ఎపిజిఎల్ఐ కార్యకలాపాలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అన్నిశాఖల ఉద్యోగులకు సంబంధించిన ఎపి ప్రభుత్వ జీవిత బీమా (ఎపిజిఎల్ఐ) వ్యవహారాలన్నీ ఇకపై నిధిపోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో జరుగుతాయని ఎపి ప్రభుత్వ జీవిత బీమా కార్యాలయం సహాయ సంచాలకులు సతీష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే పాలసీదారుల పాలసీ, స్వీకరించిన ప్రీమియం, లోన్ పొందిన వివరాలను నిధి పోర్టల్‌కు బదిలీ చేశామన్నారు. ఈ నేపథ్యంలో ఎపిజిఎల్ఐ పాలసీ తీసుకున్న వారు, ప్రీమియం జమలను, లోన్ పొందిన వారు ఆ పోర్టల్ లో ఉన్న డేటాను పరిశీలించి ధ్రువీకరించుకోవాలన్నారు. ఏప్రిల్ 30 వరకు అవకాశం ఉందన్నారు. పాలసీవారిగా డేటా ముద్రించిన కాపీలు ఆయా శాఖల డిడిఒల ద్వారా పాలసీదారులకు పంపిణీ చేస్తారన్నారు.

టిడిపి మూడో జాబితాలో ట్విస్టు

గొండు శంకర్, శ్రీకాకుళం

మామిడి గోవిందరావు, పాతపట్నం

గౌతు శిరీష, పలాస

సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తుండడంతో రాజకీయ పార్టీల్లో టిక్కెట్లు కేటాయింపు తుది దశకు చేరింది. టిక్కెట్లు కేటాయింపులో వైసిపి ముందంజలో ఉండగా, టిడిపి దశల వారీగా కేటాయింపులు జరుపుతోంది. అందులో భాగంగా టిడిపి శుక్రవారం మూడో జాబితాను విడుదల చేసింది. ముందుగా చెబుతున్నట్టుగానే యువతకు ప్రాధాన్యత ఇచ్చారు. మూడో జాబితాలో పరిశీలిస్తే టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు మార్కు జిల్లాపై స్పష్టంగా కనిపిస్తుంది.

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

- ప్రకటించిన మూడు ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు
- శ్రీకాకుళం, పాతపట్నంలో కొత్త ముఖాలు
- కలమట, లక్ష్మీదేవికి దక్కని సీట్లు
- టిడిపి నాయకుల ఆందోళనలు

మొదటి దశలో జిల్లాలోని ఇచ్ఛాపురం, టెక్కలి, ఆమదాలవలస టిడిపి అభ్యర్థులను ప్రకటించగా, రెండో జాబితాలో నరసన్నపేట టిడిపి అభ్యర్థిని ఖరారు చేశారు. మూడు జాబితా కోసం ఉత్కంఠగా ఎదురు చూస్తున్న సమయంలో శ్రీకాకుళం, పాతపట్నం నియోజకవర్గాల్లో పాత వారిని కాదని కొత్త అభ్యర్థులను ప్రకటించారు. మూడో దఫా యువతకు ప్రాధాన్యత కల్పించారు. శ్రీకాకుళం పార్లమెంట్ పరిధిలోని మూడు స్థానాల్లో పోటీ చేసే అభ్యర్థులను ప్రకటించారు. గత ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి చవి చూసిన గౌతు శిరీషకు తిరిగి పలాస నియోజకవర్గం అభ్యర్థిత్వం ఖరారు చేశారు. శ్రీకాకుళం నియోజకవర్గానికి ఇన్‌ఛార్జిగా ఇప్పటి వరకు కొనసాగిన గుండ లక్ష్మీదేవిని కాదని యువకుడు, ఇంజినీరింగ్ పట్టభద్రుడైన గొండు శంకర్‌కు టిక్కెట్టు ఖరారు చేశారు. అలాగే పాతపట్నం నియోజకవర్గ ఇన్‌ఛార్జి కలమట వెంకటరమణను కాదని పారిశ్రామిక వేత్త మామిడి గోవిందరావుకు టిక్కెట్టు ఇచ్చారు. వాటితో పాటు ఎంపీ స్థానానికి సిట్టింగ్ ఎంపి కింజరాపు రామ్మోహన్ నాయుడికే తిరిగి అభ్యర్థిగా ప్రకటించారు. ఎచ్చెర్ల స్థానంపై ఇంకా స్పష్టత రాలేదు. మూడో జాబితాలో టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు సిపార్సులకు సీట్లు ఇచ్చారని పార్టీ వర్గాలు భావిస్తున్నారు. అందులో భాగంగానే సుదీర్ఘకాలంగా టిడిపిలో ఉన్న గుండ అప్పలసూర్యనారాయణ, లక్ష్మీదేవి దంపతులను కాదని నిన్నమొన్నటి వరకు వారి అంతరంగాకుడిగా వ్యవహరించి విభేదించిన గుండ శంకర్‌కు టిక్కెట్టు లభించింది. అలాగే గత ఎన్నికల సమయంలో కలమట వెంకటరమణ టిడిపిని వీడి వైసిపిలో చేరారు. వైసిపిలో ఎమ్మెల్యేగా గెలుపొందిన తర్వాత తిరిగి టిడిపిలో చేరారు. 2019 ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. ఈసారి టిక్కెట్టు దక్కలేదు. ఆయన స్థానంలో గోవిందరావుకు టిక్కెట్టు కేటాయించారు. వాస్తవానికి శ్రీకాకుళం అసెంబ్లీ టిక్కెట్ బిజెపికి కేటాయిస్తారన్న ప్రచారం జరిగింది. దీంతో పలువురు టిడిపి శ్రేణులు ఎంపీ నివాసం ముందు ఇటీవల ఆందోళన చేశారు. విషయాన్ని ఎంపీ చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. శ్రీకాకుళం నియోజకవర్గ టిక్కెట్ బిజెపికి ఇస్తే ఆ ప్రభావం తనపై పడుతుందని అధినేతకు చెప్పినట్టు పార్టీలో చర్చ జరుగుతోంది. దీంతో ఈ టిక్కెట్టును పొత్తులో భాగంగా బిజెపికి కేటాయించకుండా పునరాలోచనలో పడ్డారు. తదనంతర పరిణామాల్లో శ్రీకాకుళం టిక్కెట్టును గొండు శంకర్ కేటాయించారు.

ఎమ్మెల్యే అభ్యర్థుల నేపథ్యం

గౌతు శిరీష, పలాస అభ్యర్థి

గౌతు శిరీష ఎంబిఎ (మార్కెటింగ్), బిఎల్ పూర్తి చేసిన ఈమె ది రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం. తాత గౌతు లచ్చన్న ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు, సోంపేట నియోజకవర్గం నుంచి శాసన సభ్యునిగా, శ్రీకాకుళం పార్లమెంట్ స్థానం నుంచి ఎంపీగా గతంలో పనిచేశారు. సుదీర్ఘ కాలం పాటు కాంగ్రేసేతర పార్టీల నుంచి ప్రాతినిథ్యం వహించారు. ఆయన రాజకీయ వారసత్వంగా కుమారుడు గౌతు శ్యామసుందర శివాజీ తెలుగుదేశం పార్టీలో సోంపేట, పలాస నియోజకవర్గాల నుంచి శాసనసభ్యునిగా పనిచేశారు. చంద్రబాబు క్యాబినెట్‌లో మంత్రిగా కూడా కొద్ది రోజులపాటు పని చేశారు. గత ఎన్నికల్లో అనారోగ్య కారణాలతో రాజకీయాల నుంచి నిష్క్రమించిన ఆయన స్థానంలో పలాస నియోజక వర్గం నుంచి గత ఎన్నికల్లో పోటీ చేసి ప్రస్తుత మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు చేతిలో ఓటమి చవిచూశారు. ఈ సారి ఎన్నికల్లో తిరిగి ఆమెకే పార్టీ అధిష్టానం టిక్కెట్‌ను ఖరారు చేసింది.

మామిడి గోవిందరావు, పాతపట్నం అభ్యర్థి

పాతపట్నం మండలం సీది గ్రామానికి చెందిన మామిడి గోవిందరావు పైడిభీమవరంలో ఉన్న శాంపిస్టన్స్ కంపెనీలో ఉద్యోగిగా పనిచేసి తదనంతరం రియల్టరుగా మారాడు. జిల్లాలోనే కాక ఉత్తరాంధ్ర ప్రాంతంలో రియల్ ఎస్టేట్ వ్యాపారిగా ఎదిగారు. అతని తల్లి పాతపట్నం మండల పరిషత్ అధ్యక్షులుగా పనిచేశారు. ఆ సమయంలో టిడిపిలో పాతపట్నం మండలంలో క్రియాశీలకంగా వ్యవహరించారు. గత ఎన్నికల అనంతరం పాతపట్నం నుంచి టిడిపి టిక్కెట్‌ను ఆశిస్తున్నట్టు ప్రకటించిన గోవిందరావు గ్రామాల్లో యువతను కలుపుకుని ఆలయాల అభివృద్ధి, పేదల వివాహ సమయంలో సాయమందించడం వంటి సేవా కార్యక్రమాలు పెద్దఎత్తున నిర్వహించారు. ఎంపీ, టెక్కలి ఎమ్మెల్యేతో అత్యంత సన్నిహితంగా మెలుగుతూ ఎట్టకేలకు టిడిపి అభ్యర్థిగా బరిలోకి దిగేందుకు అర్హత సాధించారు.

గొండు శంకర్, శ్రీకాకుళం అభ్యర్థి

శ్రీకాకుళం మండలం కిష్టప్పపేట ఈయన స్వస్థలం. ఇంజినీరింగ్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన ఆయన జాతీయ రహదారి నిర్మాణ సంస్థలో ఉద్యోగిగా, కన్సల్‌టెంట్‌గా పనిచేశారు. ఆయన తండ్రి గొండు జగతి కిష్టప్పపేట సర్పంచ్‌గా పనిచేస్తూ మండల పరిషత్ ప్రాదేశిక సభ్యునిగా ఎంపికైన తర్వాత ఆయన రాజకీయ వారసునిగా గ్రామ సర్పంచ్‌గా పోటీ చేసి గెలుపొందారు. అనంతరం సింగుపురం ఎంపిటిసి సభ్యునిగా పనిచేసిన ఆయన గుండ కుటుంబానికి వీర విధేయునిగా ఉంటూ గత ఎన్నికల సమయంలో అన్నీతానై వ్యవహరించారు. ఎన్నికల అనంతరం గుండ కుటుంబంతో విభేదాలు రావడంతో నియోజకవర్గంలో తానూ టిక్కెట్ రేసులో ఉన్నానంటూ గడచిన రెండున్నరేళ్లుగా గ్రామ గ్రామాన కార్యక్రమాలు చేస్తూ టిక్కెట్ రేసులో పోటీపడ్డాడు. టిడిపి రాష్ట్ర అధ్యక్షునికి దగ్గరైన తర్వాత తనకంటూ ఓ ప్రత్యేకతను చాటుకున్నారు. సోషల్ మీడియాలో చురుగ్గా వ్యవహరిస్తూ పార్టీ నాయకత్వానికి దగ్గరైన ఆయనకు మూడో జాబితాలో టిక్కెట్ లభించింది.

శ్రీకాకుళం ఎంపీ అభ్యర్థిగా కింజరాపు రామ్మోహన్‌నాయుడు

తెలుగుదేశం పార్టీలో అత్యంత కీలకమైన వ్యక్తుల్లో యువకుడు కింజరాపు రామ్మోహననాయుడు ఒకరు. ఆయనకు ముచ్చటగా మూడో సారి శ్రీకాకుళం ఎంపీ అభ్యర్థిగా తెలుగుదేశం పార్టీ తిరిగి బరిలోకి దింపింది. ఆయన తండ్రి కింజరాపు ఎర్రన్నాయుడి మృతి అనంతరం రాజకీయాల్లోకి వచ్చిన ఆయన మంచి మాటకారి తనంతో అందరినీ ఆకట్టుకుంటున్నారు. అందుకే ఆయనకే మరో మారు ఎంపీ బరిలో టిడిపి దింపుతోంది. ప్రస్తుతం ఆయన చిన్నాన్న కింజరాపు అచ్చెన్నాయుడు సిట్టింగ్ శాసన సభ్యునిగా టెక్కలి నియోజకవర్గం నుంచి కొనసాగుతున్నారు. అలాగే పార్టీ రాష్ట్ర అధ్యక్షులుగా కూడా వ్యవహరిస్తున్నారు. అదే కుటుంబం నుంచి పార్లమెంట్ స్థానానికి రామ్మోహన్ నాయుడు పోటీచేస్తున్నారు. ఆయన పేరును శుక్రవారం ప్రకటించిన ఎంపీల జాబితాలో ప్రకటించారు.

సమీక్షిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్

ఎన్నికల ఖర్చులకు ఖాతాలు తెరవాలి

జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు తప్పనిసరిగా కొత్త బ్యాంకు ఖాతాలను తెరవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ తెలిపారు. కలెక్టరేట్‌లో జెసి ఎం.నవీన్‌తో కలిసి ఎన్నికల వ్యయ పర్యవేక్షణకు సంబంధించి జిల్లాలోని 27 ప్రధాన బ్యాంకుల సీనియర్ అధికారులతో బ్యాంకర్ల కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అభ్యర్థులు తమ పేరున, వారి ఏజెంట్, జాయింట్ ఖాతాలనూ తెరవవచ్చని అన్నారు. అభ్యర్థి నామినేషన్ దాఖలు చేయడానికి ఒక రోజు ముందూ ఖాతా తెరవవచ్చని స్పష్టం చేశారు. బ్యాంకు ఖాతాలు ఏదైనా బ్యాంకు, పోస్టాఫీసులో కూడా తెరవవచ్చని అన్నారు. అన్ని బ్యాంకులు ప్రత్యేక కౌంటర్‌ను తెరిచి, ప్రాధాన్యతా ప్రాతిపదికన ఖాతాలో డిపాజిట్, ఉపసంహరణలకు వీరికి అనుమతించాలని సూచించారు. బ్యాంకుల నుంచి పెద్దఎత్తున జరిగే నగదు ఉపసంహరణ లావాదేవీలపై పూర్తిగా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని బ్యాంకులను ఆదేశించారు. జిల్లాలోని 288 వివిధ బ్యాంకుల శాఖలు రోజూ తమకు సూచించిన ఐదు నివేదికలను నిర్దేశిత సమయంలోగా ఈమెయిల్ ద్వారా చేరవేయాలని స్పష్టం చేశారు. ఏదైనా అనుమానాస్పద లావాదేవీలు జరిగితే బ్యాంకులు జిల్లా ఎన్నికల అధికారికి సమాచారం ఇవ్వాలని సూచించారు.

రూ.10 లక్షల కంటే ఎక్కువ విత్‌డ్రా అయితే అన్ని బ్యాంకులు డిఇఒలకు సమాచారం ఇవ్వాల్సి ఉంటుందని పేర్కొన్నారు. తదుపరి అవసరమైన చర్యల కోసం తాము ఆదాయపు పన్ను శాఖకు సమాచారాన్ని పంపిస్తామని స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో, నగదు రవాణా కోసం ఇఎస్ఎంఎస్ పోర్టల్ నుంచి బ్యాంకుల ద్వారా క్యూఆర్ కోడ్ రసీదులు తీసుకుని దానిని నగదు రవాణా చేసే వాహనంతో పాటు వచ్చే అధికారికి అందజేయాలని చెప్పారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, లీడ్ బ్యాంకు జిల్లా మేనేజర్ ఎం.సూర్యకిరణ్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ మేనేజర్ ఎం.వి.తిలక్, డిసిసిబి సిఇఒ వరప్రసాద్, గ్రామీణ వికాస్ బ్యాంకు ఆర్ఎం రాఘవేంద్ర పాల్గొన్నారు.

ప్రచారాలకు అనుమతులు తప్పనిసరి

జిల్లాలోని ఆయా నియోజకవర్గాల్లో నిర్వహిస్తున్న వివిధ రాజకీయ పార్టీల ప్రచారాలకు అనుమతులు తప్పనిసరిగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ శుక్రవారం వెల్లడించారు. నియోజకవర్గాల్లో నిర్వహిస్తున్న సమావేశాలకు, లౌడ్‌స్పీకర్లకు అనుమతులు తప్పనిసరిగా ఉండాలన్నారు. తాత్కాలికంగా పార్టీ కార్యాలయం ఏర్పాటు చేసినా, ప్రచారాలకు వినియోగించే వాహనాలకు, వీధుల్లో నిర్వహించే సమావేశాల లౌడ్‌స్పీకర్స్, సభా వేదిక, బారికేడ్లు ఏర్పాటు చేసినా, అంతర్జిల్లాలలో తిరిగే వాహనాలు, ఇంటింటా ప్రచారానికి, ర్యాలీలకు అనుమతులు తీసుకోవాలని చెప్పారు. అభ్యర్థులు ఒక వాహనానికి నియోజకవర్గంలో తిరగడానికి తీసుకున్న అనుమతి ఆ నియోజకవర్గంలో తిరగడానికి మాత్రమే ఆ వాహనాన్ని వినియోగించాలన్నారు. లౌడ్‌స్పీకర్లతో ఉన్న వాహనాలకు, పోస్టర్ల పంపిణీకి, బేనర్లు, పార్టీ జెండాలు పెట్టేందుకు, పోస్టర్లు, హోర్డింగ్‌లు ఏర్పాటు చేయాలన్నా అనుమతులు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఆన్‌లైన్‌లో అనుమతులు కావాలంటే 48 గంటలు ముందు లిసువిధలిలో ఏప్‌లో, ఆఫ్‌లైన్‌లో సంబంధిత రిటర్నింగ్ అధికారికి దరఖాస్తు చేసి 24 గంటల్లో అనుమతి పొందవచ్చన్నారు. ఆయా రాజకీయ పార్టీలు గమనించి పార్టీకి సంబంధించిన ఏ కార్యక్రమానికైనా అనుమతులు తప్పనిసరిగా ఉండాలన్నారు.

క్షయ నివారణకు కృషి

డిఎంహెచ్ఒ మీనాక్షి

మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ మీనాక్షి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో క్షయ వ్యాధి నివారణకు అందరూ సహకరించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షి అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో ప్రపంచ క్షయ నివారణ దినోత్సవంపై జిల్లా టిబి కంట్రోల్ అధికారి, అదనపు జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ ఎం.ప్రసాదరావుతో కలిసి శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 24న ప్రపంచ క్షయ వ్యాధి నివారణా దినోత్సవమని, ప్రపంచ వ్యాప్తంగా మానవాళిని పట్టిపీడిస్తున్న భయంకరమైన వ్యాధులలో క్షయ వ్యాధి ఒకటని అన్నారు. క్షయ వ్యాధిపై సమాజాన్ని పూర్తిస్థాయిలో మరింత చైతన్యవంతం చేసేందుకు ప్రభుత్వ సంస్థలతో పాటు పేరొందిన స్వచ్ఛంద సంస్థలు నడుం బిగించినట్లు వివరించారు. క్షయ వ్యాధి అంటువ్యాధి అని మైక్రో బ్యాక్టీరియా ట్యూబర్ క్లోసిస్ అనే సూక్ష్మజీవి ద్వారా ఇది సంక్రమిస్తుందని చెప్పారు. రెండు వారాలకు మించి దగ్గు, ఇతర లక్షణములు, ఆయాసం, బరువు తగ్గుట, కఫంలో రక్తం పడుట, ఛాతి నొప్పి, సాయం కాలం జ్వరం, రాత్రి నిద్రలో చెమట పట్టడం తదితర క్షయ రోగి లక్షణాలు ఉంటాయని తెలిపారు. క్షయ రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేస్తున్నామని తెలిపారు.

టిడిపికి నిరసన సెగ

శ్రీకాకుళం అర్బన్ : పోస్టర్లను దహనం చేస్తున్న కార్యకర్తలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లా రాజకీయాల్లో ప్రత్యేక గుర్తింపు ఉన్న గుండ కుటుంబానికి శ్రీకాకుళం అసెంబ్లీ సీటు దక్కకపోవడం అభిమానులు, కార్యకర్తలు శుక్రవారం నిరసన తెలిపారు. అరసవల్లిలోని గుండ స్వగృహానికి చేరుకుని గుండ అప్పలసూర్యనారాయణ, లక్ష్మీదేవి దంపతులను కలిసి ఓదార్చారు. పెద్దఎత్తున టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడుకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అలాగే ఆరు గ్యారెంటీల పోస్టర్లు, కార్డులు, పార్టీ జెండాలు, బ్యానర్లు, కండువాలను తగులబెట్టారు. అలాగే క్లాపై ఉన్న స్టిక్కర్లను తొలగించి వాటికి కాల్చి బూడిద చేశారు. చంద్రబాబును తప్పుదోవపట్టించి సుదీర్ఘ కాలం పార్టీకి సేవలందించిన గుండ కుటుంబానికి అన్యాయం చేశారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. 40 ఏళ్లుగా టిడిపిలో పనిచేస్తున్న వారిలో గుండ కుటుంబంతో ఎక్కువ అనుబంధం ఉన్న వారంతా నిరాశకు గురయ్యారు.

కొత్తూరు : పాతపట్నం నియోజకవర్గ టిడిపి టిక్కెట్‌ను కలమట వెంకటరమణకి కేటాయించ పోవడంతో టిడిపి నాయకులు స్థానిక నాలుగు రోడ్ల కూడలి వద్ద చంద్రబాబు డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎల్.భగవాన్‌దాస్‌నాయుడు, నెల్లి అచ్యుతరావు, ఎ.మాధవరావు, కె.వెంకటరావు, సీతారాం, ఆనందరావు, ఎం.రాజారావు పాల్గొన్నారు.

కొత్తూరు : ఆందోళన చేస్తున్న టిడిపి నాయకులు

ఇండిపెండెంట్‌గా బరిలోకి లక్ష్మీదేవి

శ్రీకాకుళం అర్బన్ : ఇండిపెండెంట్‌గా బరిలోకి దిగుతామని మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి స్పష్టం చేశారు. అరసవల్లిలోని తన నివాసం వద్ద అభిమానులతో కలిసి శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. టిడిపి అసెంబ్లీ టిక్కెట్ ప్రకటన వెలువడిన తర్వాత ఉదయం నుంచి కార్యకర్తలు, అభిమానులు ఇండిపెండెంట్‌గా పోటీ చేయాలని ఒత్తిడి చేస్తున్న నేపథ్యంలో అభిప్రాయాయాలను గౌరవిస్తానని తెలిపారు. నియోజకవర్గంలోని గార, శ్రీకాకుళం రూరల్ మండలాలు, శ్రీకాకుళం నగరానికి చెందిన నాయకులతో, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఇండిపెండెంట్‌గా పోటీచేసి కార్యకర్తల మనోభావాలను కాపాడుతానన్నారు. తెలుగుదేశం పార్టీ అభ్యున్నతి కోసం నాలుగు దశాబ్దాలు తమ కుటుంబం పనిచేసిందని, తన భర్త గుండ అప్పల సూర్యనారాయణ నాలుగుసార్లు ఎమ్మెల్యేగా, ఎన్‌టిఆర్ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేశారని, తాను చంద్రబాబు హయాంలో ఎమ్మెల్యేగా పని చేశానని అన్నారు. తమ సేవలకు జిల్లాకు చెందిన నేతలు కొందరు అడ్డంకిగా మారారని, ఎన్నో ఎన్నికల్లో తనను, తన భర్తను ఓడించేందుకు కుట్రలు, కుతంత్రాలు జరిగాయని, చివరకు టిక్కెట్ కూడా దక్కకుండా చేశారని ఆక్షేపించారు. సమావేశంలో టిడిపి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టిడిపి నాయకుల రాజీనామా

మెళియాపుట్టి : వెంకటరమణకు టిడిపి టిక్కెట్ ఇవ్వకపోవడంతో నాయకులు, కార్యకర్తలు శుక్రవారం మూకుమ్మడిగా రాజీనామా చేశారు. రాజీనామా చేసిన వారిలో మండల టిడిపి అధ్యక్షులు భాస్కరగౌడ, ప్రధాన కార్యదర్శి ఉర్లాన వసంత్, మండల తెలుగు యువత అధ్యక్షులు బసవ పరమేశ్వరరెడ్డి, పెద్దపద్మాపురం సర్పంచ్ ప్రతినిధి మాలతి శ్రీధర్, మరిపడిసి పంచాయతీ సర్పంచ్ ప్రతినిధి రవ్వల గణపతిరావు, సంతలక్ష్మీపురం సర్పంచ్ బమ్మిడి భాస్కరరావు, మారడికోట మాజీ సర్పంచ్ అడ్డాల శ్రీనివాసరావు, ఉర్లన రుక్మందరావు, సిలార్, లక్ష్మణరావు, ఎస్.వెంకటరావు, ఎల్లంనాయుడు తదితరులు ఉన్నారు.

'పది' పరీక్షా కేంద్రాలు పరిశీలన

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని కింతలి, తాడివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో జరుగుతున్న పదో తరగతి పరీక్ష కేంద్రాలను ఎపి బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం శుక్రవారం ఆకస్మికంగా పరిశీలించారు. విద్యార్థులు సౌకర్యవంతంగా పరీక్షలు రాస్తున్నారా? వెలుతురు, గాలి పరిపూర్ణవంతంగా అందుతున్నాయా? తాగునీటి సౌకర్యం, ప్రాథమిక వైద్య సదుపాయాలు కల్పిస్తున్నారా? పరీక్షలు రాసేందుకు సరిపడ నిష్పత్తిలో టేబుళ్లు, కుర్చీలు సమకూర్చారా? లేదా? పరీక్షలు రాస్తున్న విద్యార్థులు వడ దెబ్బ వంటి అనారోగ్య పరిస్థితులు ఎదురైతే వైద్య పరంగా ఎటువంటి ముందస్తు చర్యలు చేపట్టారో అడిగి తెలుసుకున్నారు. వికలాంగ విద్యార్థులు ఎంత మంది రాస్తున్నారు? వారికి కల్పించిన ప్రత్యేక ఏర్పాట్లపైనా క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. పరీక్ష రాస్తున్న సమయంలో విద్యుత్ అంతరాయం ఏర్పడితే తిరిగి పునరుద్ధరణకు విద్యాశాఖాధికారులు, విద్యుత్ శాఖాధికారుల సమన్వయంతో ఎటువంటి యుద్ధప్రాతిపదిక చర్యలు చేపడుతున్నారా? లేదా? అని అడిగి తెలుసుకున్నారు. పది పరీక్షలను దృష్టిలో ఉంచుకొని విద్యుత్‌శాఖ, ఆర్‌టిసి, పోలీసు, వికలాంగులశాఖ, విద్యాశాఖ, వైద్య ఆరోగ్యశాఖాధికారులతో సమీక్ష సమావేశాలు, అవగాహనా కార్యక్రమాలు ఏర్పాటు చేసి వారిని సమాయత్తం చేశామన్నారు. దీనిలో భాగంగానే పరీక్ష కేంద్రాలను సందర్శించి లోటుపాట్లపై ఉన్నతాధికారులకు నివేదికలు అందజేస్తున్నామని తెలిపారు. ఈయన వెంట ఎంఇఒ పి.రామరాజు, స్త్రీ, శిశు సంక్షేమశాఖ సిడిపిఒ ఎస్.అనురాధ, పిఒఐసి మెట్ల మల్లేశ్వరరావు, కార్యదర్శులు, గ్రామ సచివాలయ సిబ్బంది ఉన్నారు.

కింతలి పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీతారాం

గోకర్ణపల్లి పోలింగ్ కేంద్రం పరిశీలన

పొందూరు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండలంలోని అత్యంత సమస్యాత్మకమైన గోకర్ణపల్లిలోని పోలింగ్ కేంద్రాన్ని ఎస్‌పి జి.ఆర్.రాధిక శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్ర పరిసరాలను పరిశీలించారు. పోలింగ్ కేంద్రానికి ప్రహరీ లేకపోవడంపై అధికారులను ప్రశ్నించారు. గ్రామంలో ఎటువంటి వివాదాలకు ఆస్కారం లేకుండా పోలింగ్ సజావుగా నిర్వహించాలని పోలీస్ సిబ్బందికి ఆదేశించారు. ఈమె వెంట డిఎస్‌పి శృతి, ఎస్ఐ రవికుమార్, ఎఎస్ఐ రామచంద్రరావు ఉన్నారు.

పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్‌పి రాధిక

రిటర్నింగ్ అధికారులతో సమీక్ష

ప్రజాశక్తి- శ్రీకాకుళం

శ్రీకాకుళం అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారులతో, సెక్టార్ అధికారులతో నియోజకవర్గ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి బి.వి.రాణి, ఎన్నికల ఉప తహశీల్దార్ జి.కె.శ్రీను శుక్రవారం సమీక్షించారు. పోలింగ్ కేంద్రాల్లోని వసతులు, పోలింగ్ కేంద్రాలకు చేరుకునే రూట్ ప్లాన్ గురించి చర్చించారు.

ఆర్‌టిసి ఉద్యోగుల హామీలు అమలు చేయాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఆర్‌టిసి ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వి.నరసయ్య డిమాండ్ చేశారు. శ్రీకాకుళంలో రాష్ట్రస్థాయి సిసిఎస్ డెలిగేట్ల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2021లో జరిగిన సొసైటీ ఎన్నికల్లో నేషనల్ మజ్దూర్ యూనియన్ కూటమి ఆర్‌టిసి ఉద్యోగులకు ఎన్నో హామీలిచ్చారని గుర్తు చేశారు. గెలిచి మూడేళ్లు దాటున్నా ఒక్క హామీనీ నెరవేర్చలేదన్నారు. ఉద్యోగులకు దరఖాస్తు చేసిన 24 గంటలలో రుణాన్ని మంజూరు చేస్తామని చెప్పారని, కానీ, ఇంతవరకు ఆ హామీని అమలు చేయలేదని పేర్కొన్నారు. అన్ని జిల్లాల్లో కో-ఆపరేటివ్ స్టోర్సుపెట్టి తక్కువ ధరకు సరుకులు పంపిణీ చేస్తామన్న విషయమూ తుంగలో తొక్కారన్నారు. ఈ హామీలన్నీ ఏమయ్యాయని ప్రశ్నించారు. ఎసిపిటెడ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తుంది ఒక్క ఇయు మాత్రమేనని చెప్పారు. ఇయు రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి పి.భానుమూర్తి మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న సిసిఎస్ మేనేజింగ్ కమిటీ డెలిగేట్లతో చర్చించకుండా ఏకపక్షంగా నిర్ణయాలు చేస్తూ ఉద్యోగులకు నష్టం కలిగిస్తున్నారన్నారు. ఈ సమావేశానికి ఆర్‌టిసి మేనేజింగ్ డైరెక్టర్ సి.హెచ్.ద్వారకాతిరుమలరావు పాల్గొన్నారు. అనంతరం తిరుమలరావుకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ఇయు రాష్ట్ర సహాయ కార్యదర్శి పి.నావాజీ, విజయనగరం జోనల్ కార్యదర్శి బాసూరి కృష్ణమూర్తి, జిల్లా అధ్యక్షులు గువాపు త్రినాథ్, కార్యదర్శి కె.దశరథుడు, ఇయు సీనియర్ నాయకులు ఎస్.అప్పారావు, ఎస్.ఎస్.ఆర్.శర్మ, కొల్లాం గణేశ్వరరావు పాల్గొన్నారు. ముందుగా ఈయనకు ఎస్‌పి జి.ఆర్.రాధిక మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

ద్వారకా తిరుమలరావును సన్మానిస్తున్న ఉద్యోగులు

కోడ్ ఉల్లంఘనలపై కేసులు

జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్


మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా అమలు చేయాలని, కోడ్ ఉల్లంఘనలపై దృష్టి పెట్టి కేసులు నమోదు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనజీర్ జిల్లాని సమన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో నోడల్ అధికారులు, రిటర్నింగ్ అధికారులు, ఎంసిసి అమలు బృందాల శుక్రవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించే అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. క్షేత్రస్థాయిలో కోడ్ ఉల్లంఘన సంఘటనలకు స్థానిక అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఎంసిసి, ఎన్నికలకు సంబంధించిన అన్ని రకాల బృందాలు సంబంధిత ఆర్ఒ కిందనే పనిచేయాల్సి ఉంటుందని తెలిపారు. ఎన్నికలకు సంబంధించి సువిధ వెబ్‌సైట్, యాప్‌ల ద్వారా మాత్రమే అనుమతులు జారీ చేయాలని, అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో సుమారు 19 రకాల అనుమతులను జారీ చేస్తారని అన్నారు. ఆయా రాజకీయ పార్టీలు, పోటీ చేసే అభ్యర్థులు ఈ అవకాశాన్ని ఆన్‌లైన్ ద్వారా వినియోగించుకోవాలని తెలిపారు. ఎన్నికల సభలు, సమావేశాలు, ర్యాలీలు, ప్రదర్శనలు, ప్రచారం, వాహనాలు తదితర అన్నిటికీ అనుమతులు తప్పనసరిన్నారు. దరఖాస్తు చేసిన వెంటనే వీలైనంత త్వరగా అనుమతులు జారీ చేయాలని ఆదేశించారు. ఇంటింటా ప్రచారానికీ అనుమతి ఉండాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం నుంచి జీతం, వేతనం, గౌరవ భృతి తీసుకొనే ప్రతి ఒక్కరికీ నియమావళి వర్తిస్తుందని చెప్పారు. వారు రాజకీయ పార్టీల కార్యకలాపాల్లో, ప్రచారాల్లో పాల్గొనకూడదని స్పష్టం చేశారు. ఎన్నికల సిబ్బందికి అవసరమైన రవాణా వాహనాలను సమకూర్చడంలో జాప్యం చేయరాదని ఆదేశించారు. పోస్టల్ బ్యాలెట్ విధానంపై ఉద్యోగులందరికీ సూచనలు ఇవ్వాలన్నారు. ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు స్వీప్ కార్యక్రమాలను ముమ్మరం చేయాలన్నారు. ఓటర్ కార్డుల పంపిణీ శత శాతం పూర్తి కావాలన్నారు. సి విజిల్ బృందాలు అప్రమత్తంగా ఉండాలని, అన్ని టీములు సమన్వయంతో పని చేయాలని చెప్పారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం నవీన్, టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, సహాయ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, ఆర్‌డిఒ సిహెచ్.రంగయ్య, డిఆర్‌డిఎ పీడీ కిరణ్‌కుమార్, ఐసిడిఎస్ పీడీ బి.శాంతిశ్రీ, జిఎస్‌టి అసిస్టెంట్ కమిషనర్ రాణీమోహన్, సిపిఒ ప్రసన్నలక్ష్మి, లీడ్ బ్యాంకు మేనేజర్ సూర్యకిరణ్, డిటిసి చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా ఆడిట్ అధికారి సుల్తానా, సెబ్ అధికారి తిరుపతి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుబ్బారావు, ఔషధ నియంత్రణ శాఖ ఏడీ చంద్రరావు, గ్రామ, వార్డు సచివాలయాల నోడల్ అధికారి వాసుదేవరావు, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కె.చెన్నకేశవరావు, డిపిఒ వెంకటేశ్వర్లు, గడ్డెమ్మ, చల్లా ఓబులేసు, నగేష్, చిట్టిరాజు పాల్గొన్నారు.

చెక్కును అందజేస్తున్న ఎస్‌పి రాధిక

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం

ప్రజాశక్తి- శ్రీకాకుళం

బూర్జ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కె.సురేష్ కుటుంబ సభ్యులను ఆదుకుంటామని ఎస్‌పిజి.ఆర్.రాధిక అన్నారు. మృతుని కుటుంబానికి పోలీసు ప్రధాన కార్యాలయం నుంచి మంజూరైన అడిషనల్ కార్పాస్ ఫండ్ రూ.లక్ష చెక్కును మృతుని భార్య కె.శిరీష, కుటుంబ సభ్యులకు శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ సురేష్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం బాధకరమన్నారు. బాధిత పోలీస్ కుటుంబాలకు జిల్లా పోలీస్ శాఖ ఎప్పుడు అండగా ఉంటుందని తెలిపారు. మీకు ఏ సహాయం కావాలన్న ఫోన్ ద్వారా, స్వయంగా జిల్లా పోలీసు కార్యలయాన్ని సంప్రదించాలన్నారు. రావాల్సిన మిగిలిన ప్రయాజనాలు త్వరితగతిన వచ్చేటట్లు చర్యలు తీసుకోవాలని కార్యయల సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఎఒ సిహెచ్.గోపినాథ్ పాల్గొన్నారు.

ఆమదాలవలస: ఇటీవల మృతి చెందిన కానిస్టేబుల్ కె.సురేష్ కుటుంబానికి సిఐ వాయునందన్ దివాకర్ యాదవ్ ఆర్థికసాయాన్ని అందించారు. ఈ మేరకు సర్కిల్ పరిధిలో ఉన్న పోలీసులందరి నుంచి విరాళాలు సేకరించి మృతుని భార్యకు రూ.లక్ష ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ కె.వెంకటేష్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ నూరుల్ కమర్

ఎన్నికల నియమావళి తప్పనిసరి

ప్రజాశక్తి- టెక్కలి

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో రాజకీయ పార్టీలు ఎన్నికల నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, నియమావళిని ఉల్లంఘించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ అన్నారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలవుతున్న నేపథ్యంలో రాజకీయ పార్టీలు తమ ప్రచారాలపై నియమావళికి అనుగుణంగా ప్రచారాలు చేపట్టాలన్నారు. అధికారులు ఏఒక్క రాజకీయ పార్టీకి వత్తాసు పలకరాదని, ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు విధులు నిర్వహించాలన్నారు. నియోజకవర్గంలో మూడు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు పర్యటిస్తున్నాయని ఎటువంటి అనుమతులు లేకుండా ఎన్నికల నియమాలను ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ర్యాలీలు, బహిరంగ సమావేశాలకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని, దరఖాస్తు చేసుకున్న 24 గంటల్లో అనుమతులు మంజూరు చేస్తామని తెలిపారు. ఇప్పటికే కోడ్‌ను పటిష్టంగా అమలు చేస్తున్నామని, ఏమైనా ఫిర్యాదులుంటే స్వయంగా తెలియజేయాలన్నారు. సమావేశంలో టిడిపి నాయకులు బగాది శేషగిరి, పెదరెట్టి మణి, వైసిపి నాయకులు పినకాన వైకుంఠరావు, ఎస్,మోహనరావు, బిజెపి నాయకులు బూరి నరేంద్ర కుమార్, వినయ్, దొక్కరి మాధవరావు పాల్గొన్నారు.

రక్తదానం చేస్తున్న విద్యార్థిని

'ఐతమ్'లో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి అదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం మెగా ఉచిత రక్తదాన శిబిరం నిర్వహించారు. ఇండియన్ రెడ్‌క్రాస్, జి.జిమోన్, ఐతమ్ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో 160 యూనిట్లు రక్తాన్ని సేకరించారు. ఈ శిబిరంలో కళాశాల డైరెక్టర్ ప్రొఫెషర్ వి.వి.నాగేశ్వరరావు, కార్యదర్శి ఎల్.ఎల్.నాయుడు, కోశాధికారి టంకాల నాగరాజు, ప్రిన్సిపాల్ డా.ఎ.ఎస్. శ్రీనివాసరావు, డా: డి.విష్ణుమూర్తి, రెడ్‌క్రాస్ ప్రతినిధి పెంకి చైతన్య, వైద్యులు కె.శ్రీనివాస్, జ్యోత్స్న పాల్గొన్నారు.

'విష'మిస్తున్న ప్రచారం

ప్రజాశక్తి- కవిటి

ఇచ్ఛాపురం నియోజకవర్గం కేంద్రంగా రాజకీయ పార్టీల విష ప్రచారం మితిమీరుతోంది. ఏ విధంగానైనా విజయమే లక్ష్యంగా పనిచేయాలని అడ్డదారులు తొక్కుతోంది. విజయమే లక్ష్యంగా విష ప్రచారానికి తెరలేపుతున్నారు. ఎన్నడూ లేని విధంగా పత్రికల పేరుతో తప్పుడు కథనాల క్లిప్పింగ్‌లను సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. అందులో భాగంగా ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాలం అశోక్‌పై ఒక పత్రికలో వచ్చినట్టు మంగళవారం జిల్లా వ్యాప్తంగా ఓ కథనం హల్ చల్ చేయగా, విశాఖ డ్రగ్స్ కేసులో చంద్రబాబు గ్యాంగ్ పేరిట ఒక పత్రికలో కథనం వచ్చినట్టు శుక్రవారం ఒక క్లిప్పింగ్ హల్ చల్ చేసింది. వీటిని వైసిపి నాయకులు గ్రూపుల్లో ఫార్వర్డ్ చేస్తున్నారని టిడిపి శ్రేణులు ఆరోపిస్తున్నాయి. ఇచ్ఛాపురం కేంద్రంగా ఇటువంటి ప్రచారాలు ఎక్కువగా జరుగుతున్నట్టు ఆరోపిస్తున్నారు. పత్రికల పేరు మార్ఫింగ్ చేస్తూ ఇటువంటి కథనాలు ప్రచారం చేయడం సరికాదని, దీనిపై బాధ్యులను గుర్తించి కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

నూతన విధానాలను అలవర్చుకోవాలి

ప్రజాశక్తి- నరసన్నపేట

ప్రస్తుత ఆధునిక యుగంలో అందుబాటులోకి వస్తున్న నూతన సాంకేతికత విధానాలను విద్యార్థులు నేర్చుకోవాలని, అప్పుడే ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని జంతుశాస్త్ర నిపుణులు సుసరాపు సతీష్ అన్నారు. శుక్రవారం స్థానిక పద్మావతి డిగ్రీ కళాశాల జువాలజీ విభాగం 'రీసెంట్ ట్రెండ్స్ ఇన్ జువాలజీ ఇన్నోవేషన్స్ ఛాలెంజెస్ అండ్ అపార్చునిటీస్' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పరిశోధనల వైపు దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. జీనోమిక్స్ రంగంలో విస్తృత అవకాశాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. రోగుల్లో యాంటి బయోటిక్స్ నిరోధకతకు ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. దానిపై సవివరమైన అధ్యయనాలు ఇప్పటికీ ఎన్నో జరిగాయని, మరెన్నో జరగాల్సిన అవసరం ఉందన్నారు. డిఎన్ఎ, మరమ్మతులు, వ్యాధులు సంక్రమించేందుకు కారణాలు, పరిష్కారాలను వివరించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ సిహెచ్ దుర్గా ప్రసాద్, ప్రిన్సిపాల్ రమణమూర్తి, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బోధిస్తున్న సతీష్

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

లావేరు : మాట్లాడుతున్న గిరిధర్

కవిటి : జలం అక్షరాల ఆకారంలో కూర్చున్న విద్యార్థులు

లావేరు : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత కావాలని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్ అన్నారు. శుక్రవారం ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా మండలంలోని అదపాక జెడ్‌పి పాఠశాలలో ప్రపంచ జల దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని కలుషితం కాకుండా ప్రతిఒక్కరు చూడాలన్నారు. మొక్కలు నాటడం, నీటి వనరులు సద్వినియోగం చేసుకోవడం వంటి కార్యక్రమాలు చేపట్టి భవిష్యత్ తరాలకు నీరు అందుబాటులో ఉండే విధంగా బాధ్యత తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అగతమూడి వాసుదేవరావు, ఇన్‌ఛార్జి హెచ్‌ఎం నీలంరాజు, కృష్ణారావు, బొడ్డేపల్లి జగన్నాథరావు, జి.మురళీ, ఉపాధ్యాయులు ఎన్.వి.రమణ, పి. లక్ష్మణరావు, రుద్రప్రతాప్ పాల్గొన్నారు.

అలాగే బుడుమూరు ఉన్నత పాఠశాలలో జల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయుడు, నేషనల్ గ్రీన్‌కోర్ జిల్లా కో-ఆర్డినేటర్ పూజారి గోవిందరావు మాట్లాడుతూ భవిష్యత్ తరాల కోసం నీటిని పొదుపుగా వాడాలని కోరారు. విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు, నినాదాల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేసారు. విద్యార్థులు నీటిబిందువు ఆకారంలో కూర్చుని నీటి ప్రాముఖ్యతను తెలియజేశారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి హెచ్‌ఎం ఎస్.కె.ప్రసాదరావు, ఉపాధ్యాయులు ఎం.అనురాధ, కె.వెంకటరావు, కె.చినపెంటయ్య, రమేష్ బాబు, కె.చంద్రశేఖర్, రమణమ్మ పాల్గొన్నారు.

కవిటి: మండల కేంద్రంలోని కళ్యాణి ఆంగ్ల పాఠశాల ఆవరణలో ప్రపంచ జల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో నీటిబొట్టు లోగోలను విద్యార్థులతో వేయించి జలం విశిష్టత, ఉపయోగం విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొత్తూరు: ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో కుంటిభద్ర, వసప గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు తాగునీరు పొదుపుగా వాడుకోవాలని, నీరు.వృధా చేయరాదని నినాదాలు చేస్తూ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పి.పార్వతి, ఎపిఎం జనార్ధన, సిసి జ్యోతి, విఒఎలు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: ప్రతి నీటి బిందువు జీవనానికి మూలమని మండల న్యాయసేవాసంఘం అధ్యక్షురాలు, జూనియర్

కొత్తూరు : ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

కోటబొమ్మాళి : విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి

సివిల్‌జడ్జి బిఎంఆర్.ప్రసన్నలత అన్నారు. ప్రపంచ జలదినోత్సవం సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఇఒ ఎస్.అప్పలరాజు, హెచ్‌ఎం డి.గోవిందరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

పొందూరు: మండలం తాడివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు చిత్ర లేఖన, వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ప్రతి నీటి చుక్క వృధా రాబోయే తరాలకు వ్యధ అంటూ విద్యార్థులు గీసిన చిత్రాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి హెచ్‌ఎం గురుగుబిల్లి గోపాలరావు, సైన్స్ ఉపాధ్యాయులు రావాడ పాపారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓటు వజ్రాయుధం

నందిగాం : ర్యాలీ నిర్వహిస్తున్న సంఘాల సభ్యులు

ప్రజాశక్తి- నందిగాం

ఓటుహక్కు వినియోగంపై వెలుగు కార్యాలయం ఆధ్వర్యంలో మండలంలోని జయపురం, సొంటినూరు, పెద్దబానాపురం, పాత్రుని వలస తదితర గ్రామాల్లో ఓటుహక్కుపై అవగాహన ర్యాలీలు, మానవహారం నిర్వహించి ఓటర్లకు అవగాహన కల్పించారు. ఓటర్లు విధిగా తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎపిఎం జాంబవతి, సిసిలు లీలావతి, నీలవేణి, తిరుమల దేవి, సావిత్రి, హరిప్రియతో పాటు గ్రామైఖ్య సంఘ సభ్యులు పాల్గొన్నారు.

నౌపడ: మండలంలోని నౌపడ 173వ పోలింగ్ స్టేషన్ పరిధిలో ఓటర్లకు తహశీల్దార్ సత్యనారాయణ ఓటుహక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. ఓటర్లను చైతన్యపరిచేలా గ్రామస్తులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఓటు నమోదు, మార్పులు, చేర్పులు, కార్డు బదిలీలు తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో బిఎల్‌ఒలు ఆర్.ప్రసాద్, ఉమాపతి, సచివాలయ, రెవిన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఆమదాలవలస: సరుబుజ్జిలి మండలం నందికొండ కాలనీ, చిగురువలసలోఉపాధి హామీ కూలీలకు ఓటు ప్రాముఖ్యతపై తహశీల్దార్ జి.రమేష్‌బాబు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రెవెన్యూ, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

నౌపడ : ర్యాలీ నిర్వహిస్తున్న తహశీల్దార్ సత్యనారాయణ, గ్రామస్తులు

ఆమదాలవలస : ఉపాధి కూలీలకు ఓటుహక్కుపై అవగాహన కల్పిస్తున్న తహశీల్దార్

పొందూరు: మండల కేంద్రంలో ఓటుహక్కుపై ఎంసిసి అధికారి, ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో అర్ఐ రాధ, ఎపిఒ శ్రీనివాసరావు, రెవెన్యూ, ఉపాధి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మెళియాపుట్టి : గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శాంతి

వైసిపి ఇంటింటా ప్రచారం

ప్రజాశక్తి- మెళియాపుట్టి

ప్రతి పేదవాడి ఇంటికి ప్రభుత్వ పథకం అందించిన ప్రభుత్వం వైసిపి అని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. శుక్రవారం భరణికోట పంచాయతీలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు వాస్తవాలు గమనించాలని కోరారు. మన పాలన మనమే చేసుకునేలా మనకు ఒక అవకాశం కల్పించిన నాయకుడు జగన్మోహన్ రెడ్డి అని తెలిపారు. ఇంత గొప్ప ప్రభుత్వం మళ్లీ రావాలంటే ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి గెలిపించాలని కోరారు. పలువురు సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, నాయకులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: ప్రతి గడపకు సంక్షేమ పథకాలు అందిస్తున్న సిఎం జగన్ మోహన్ రెడ్డిని గెలిపించాలని వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి, జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. మండలంలో ధర్మపురం, పూర్ణటాకంలో విస్తృతంగా ప్రచారం చేశారు. ఉపాధి కూలీల వద్దకు నేరుగా వెళ్ళి తనను గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో ఎంపిపి బోర పుష్ప, జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ, దుక్క లోకేశ్వరారావు, కె.మోహనరావు, చిట్టిబాబు, పురుషోత్తం రెడ్డి, ఇంద్రసేన రెడ్డి పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: మండలం కొల్లిపాడు, పాతటెక్కలి, బైపల్లి తదితర గ్రామాల్లో వైసిపి నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యేగా డాక్టర్ సీదిరి అప్పలరాజు, ఎంపీగా పేరాడ తిలక్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు పాలిన శ్రీనువాసరావు, ఎంపిపి ప్రతినిధి ఉప్పరపల్లి ఉదయ్ కుమార్, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు మద్దిల హరినారాయణ, దున్న బాలరాజు, తమ్మినేని శంతరావు, కర్ని శ్రీను, సర్పంచ్ తమ్మినేని ఢిల్లీరావు, టి.ధర్మారావు, నాయకులు దాలయ్య, జోగారావు, గణపతి, అనిల్ పాల్గొన్నారు.

పలాస: మండలంలోని అమలకుడియాలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు పైల వెంకటరావు చిట్టి, ఎంపిపి ప్రతినిధి ఉంగ సాయికృష్ణ, సచివాలయ కన్వీనర్ దువ్వాడ రవి కుమార్, ఎంపిటిసి

ఇచ్ఛాపురం : ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న విజయ

గొండు మోహనరావు, మాజీ ఎంపిటిసి దంతం వైకుంఠరావు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: మండలం హరిశ్చంద్రపురం పంచాయతీలో సర్పంచ్ గురువెళ్లి కేశవరావు, ఎంపిటిసిలు పూజారి సత్యం, బగాది దివాకర్ ఆధ్వర్యంలో ఎంపిపి రోణంకి ఉమా మల్లేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు నూక సత్యరాజు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ సంపతిరావు హేమసుందరరాజు, సచివాలయ కన్వీనర్ గడ్డవలస నాగభూషణరావు, మండల విప్ బొడ్డు అప్పన్న, నాయకులు కవిటి రామరాజు, మెట్ట సింహాచలం పాల్గొన్నారు.

శిరీషకు టిక్కెట్ కేటాయింపుపై హర్షం

పలాస: పలాస నియోజకవర్గంలో టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీషాకు కేటాయింపు పట్ల టిడిపి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. టిడిపి కార్యాలయంలో టిడిపి నాయకులు ఆనందోత్సాహాల మధ్య సంబరాలు జరుపుకున్నారు. గౌతు శిరీషా గెలుపే లక్ష్యంగా పని చేస్తామని, అధిక మెజారిటీతో గెలిపిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వెంకన్న చౌదరి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, రాష్ట్ర బిసిసెల్ ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, తెలుగు యువత మండల అధ్యక్షుడు కిక్కర ఢిల్లీరావు, బడ్డ నాగరాజు పాల్గొన్నారు.

టెక్కలి: ఎంపీగా మూడోసారి కింజరాపు రామ్మోహన్ నాయుడుకు పార్టీ అధిష్టానం టికెట్ కేటాయించడంపై సంబరాలు నిర్వహించారు. మండలంలోని బన్నువాడలో శుభకార్యక్రమానికి ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు పాల్గొన్నారు. ఈ మేరకు పార్టీ నాయకులు కేకు కట్ చేసి ఎంపీ రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడుకు తినిపించారు. మండల అధ్యక్షులు బగాది శేషగిరి, నాయకులు హనుమంత రామకృష్ణ, చాపర గణపతి, మామిడి రాము, పోలాకి షణ్ముఖరావు, మట్ట పురుషోత్తం, బసవల అప్పలస్వామి, దల్లి ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కూన రవికుమార్

కూటమితో వైసిపి చిత్తు

ఆమదాలవలస: టిడిపి, జనసేన, బిజెపి కూటమితో వైసిపి చిత్తుచిత్తుగా ఓటమి చెందనుందని టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో నియోజకవర్గ స్థాయి ఆత్మీయ సమావేశం నిర్వహించి మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి సొంత చెల్లెలు షర్మిల మాట్లాడుతూ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రజల సిఎం అని, జగన్మోహన్ రెడ్డి పరదాల చాటు సిఎం అని మాట్లాడుతుందని, దీనిని బట్టి జగన్మోహన్ రెడ్డి ఎటువంటి వాడో ఇట్టే అర్థమవుతుందన్నారు. వైసిపి రహిత రాష్ట్రాన్ని నిర్మించడమే మన లక్ష్యం కావాలన్నారు. జనసేన జిల్లా అధ్యక్షులు పిసిని చంద్రమోహన్, బిజెపి నియోజకవర్గ కన్వీనర్ పేడాడ సూరపునాయుడు, మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేడాడ రామ్మోహనరావు, పాపారావు, మురళీమోహన్ పాల్గొన్నారు.

వైద్య శిబిరాలకు స్పందన

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

గ్రామాల్లో నిర్వహిస్తున్న సురక్ష వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని గోవిందపురం పిహెచ్‌సి వైద్యాధికారి వాహిని ప్రియాంక అన్నారు. శుక్రవారం పాత టెక్కలిలో నిర్వహించిన వైద్య శిబిరంలో ఆమె పాల్గొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు నిపుణులైన వైద్యులతో రోగులకు ప్రాథమిక పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బిపి, షుగర్, ఇసిజి, కంటి పరీక్షలను ఉచితంగా నిర్వహించి మందులు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. 402 మందికి ప్రాథమిక పరీక్షలు నిర్వహించగా 8 మందిని రిఫర్ చేసినట్లు తెలిపారు. శిబిరంలో వైద్యులు వినయ్‌కుమార్, మేఘన, సుశీల, వైద్యసిబ్బంది సన్యాసిరాజు, ప్రసాద్, జ్యోతి, ఊర్వశి, తేజా లలితా, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

సంతబొమ్మాళి: మండలం గోవిందపురం సచివాలయంలో ఆరోగ్య సురక్ష కార్యక్రమం కార్యదర్శి సనపల ఢిల్లేశ్వరరావు అధ్యక్షత జరిగింది. ఎంపిడిఒ జి.ఉమాసుందరి హాజరై పరిశీలించారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి గోపాలరావు, వైద్యులు సుధీర్, ఫార్మాసిస్ట్ సుబ్రహ్మణ్యం, సూపర్‌వైజర్ గణేష్, కామేశ్వరి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధికి రూ.450 కోట్లతో ప్రతిపాదనలు

జక్కువ నగేష్ పట్నాయక్,
శ్రీకాకుళం పంచాయతీ రాజ్ సహాయ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం

శ్రీకాకుళం పంచాయతీ రాజ్ సబ్ డివిజన్‌లో పిఎంజిఎస్‌వై పథకం కింద జిల్లా అభివృద్ధికి రూ.450 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేయడం నా ఉద్యోగ జీవితంలో సంతృప్తినిచ్చిందని పంచాయతీరాజ్ సహాయ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జక్కువ నగేష్ పట్నాయక్ తెలిపారు. మార్చి నెలాఖరున ఉద్యోగ విరమణ చేయనున్న సందర్భంగా 'ప్రజాశక్తి'తో మాట్లాడారు. తూర్పుగోదావరి జిల్లా కాకినాడ పట్టణంలో 1962లో మార్చి 22న జక్కువ రాజేశ్వరి, లక్ష్మీనారాయణ దంపతుల కుటుంబంలో ఆరో సంతానంగా జన్మించారు.

విద్యాభ్యాసం

1967లో తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలం కొత్తపల్లిలో ప్రాథమిక విద్య ప్రారంభించారు. అదే జిల్లా అడ్డతీగలలో 1969లో 2వ తరగతి చదివారు. తండ్రి ఫారెస్టు ఆఫీసులో ఉద్యోగం రీత్యా 1970లో తూర్పుగోదావరి జిల్లా పెద్దాపురంలో మూడు, నాలుగు తరగతులు చదివారు. కాకినాడ జిల్లా పరిషత్ ఉన్నత

పాఠశాలలో 5 నుంచి 9వ తరగతి వరకు చదివారు. అదే జిల్లా రంపచోడవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1978లో పదో తరగతి ఉత్తీర్ణత పొంది స్టేట్ బ్యాంకు సాధించారు. నేషనల్ మెరిట్ కాల్షిప్ పొందారు. 1978 నుంచి 1981 వరకు శ్రీకాకుళం గవర్నమెంట్ పాలిటెక్నికల్ కాలేజీలో డిప్లమా ఇన్ సివిల్ ఇంజినీరింగ్ పూర్తి చేశారు. 1989 నుంచి 1993 వరకు కాకినాడ జెఎన్‌టియులో బిటెక్ పూర్తి చేశారు.

ఉద్యోగ జీవితం

1981లో శ్రీకాకుళం మున్సిపాలిటీలో వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యోగ జీవితం ప్రారంభించారు. 1982ంలో పంచాయతీరాజ్ డిపార్ట్‌మెంట్‌లో విధుల్లోకి చేరారు. పంచాయతీరాజ్ నరసన్నపేట సబ్ డివిజన్లో టెక్నికల్ వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేశారు. 1992లో పంచాయతీ రాజ్ డ్రాఫ్ట్ మాన్‌గా పనిచేశారు. 1994లో పంచాయతీరాజ్ సహాయ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్గఆఉద్యోగ ఉన్నత పొంది శ్రీకాకుళం సబ్ డివిజన్, పాలకొండ సబ్ డివిజన్, శ్రీకాకుళం సూపరింటెండెంట్ ఇంజినీరింగ్ కార్యాలయంలో 2024 వరకు పనిచేశారు.

సంతృప్తిపరిచే అంశాలు

43 ఏళ్ల ఉద్యోగ జీవితంలో పంచాయతీరాజ్ శ్రీకాకుళం సబ్ డివిజన్‌లో పిఎంజిఎస్‌వై పథకం కింద జిల్లా అభివృద్ధికి ప్రపోజల్స్ తయారు చేసి నిధులు మంజూరు చేయడానికి చేసిన కృషి నా ఉద్యోగ జీవితంలో సంతోషినిచ్చిందన్నారు.

ఉద్యమం నేపథ్యం

పంచాయతీరాజ్ డిపార్ట్‌మెంట్‌తో సహా ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ల సంఘం జిల్లా కార్యదర్శిగా ఐదేళ్లు పనిచేశారు. ఇంజినీర్ల అసోసియేషన్ జిల్లా వైస్ చైర్మన్‌గా 15 ఏళ్లు పనిచేసే పిఆర్ నుంచి ఆర్‌డబ్ల్యుఎస్‌గా విభజన చెందినప్పుడు, సమైక్యాంధ్ర ఉద్యమంలో అనేక పోరాటాల్లో పాల్గొన్నారు.

అవార్డులు

పంచాయతీరాజ్ డిపార్ట్‌మెంట్‌లో రాష్ట్రస్థాయి ఉత్తమ అధికారుల అవార్డులు నాలుగు సార్లు పొందారు. జిల్లాస్థాయి ఉత్తమ అధికారుల అవార్డు ఎనిమిది సార్లు పొందారు.

కుటుంబ నైపథ్యం

భార్య: జయలక్ష్మి, పెద్దకుమార్తె విజయశాంతి, అల్లుడు శ్రీధర్ మక్కువ. న్యూజిలాండ్‌లో స్థిరపడ్డారు. మనుమడు రిషబ్ మక్కువ. మనవరాళ్లు జాన్విక. చిన్న కుమార్తె: శ్వేతా కిరణ్మయి, అల్లుడు సిహెచ్.కిరణ్‌కుమార్ పట్నాయక్. చెన్నయ్‌లో స్థిరపడ్డారు. మనమరాలు జోషిక, మనవడు జయంగ్స్ ఉన్నారు.

అరసవల్లిలో యాత్రికుడు మృతి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయాన్ని సందర్శించడానికి వచ్చిన యాత్రికుడు గుండెపోటుకు గురై మృతి చెందిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. మృతుడు నరసన్నపేట మారుతీనగర్‌కు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు భాస్కరరావుగా గుర్తించారు. భాస్కరరావు దంపతులు ఆలయ సందర్శన కోసం అరసవల్లి వచ్చారు. అక్కడ సెల్‌ఫోన్ డిపాజిట్ చేసిన అనంతరం క్యూలైన్లోకి వెళ న్న సమయంలో గుండెపోటు రావడంతో అక్కడిక్కడే కుప్పకూలిపోయాడు. స్థానికులు గమనించి మృతుని బంధువులకు సమాచారం అందించారు. అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

గంజాయి స్వాధీనం చేసుకున్న రైల్వే జిఆర్‌పి పోలీసులు

60 కేజీల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి- పలాస

బీహార్ రాష్ట్రం సమిష్టిపూర్ జిల్లాకు చెందిన మహమ్మద్ షంషేర్, మహమ్మద్ షమీమ్ కలిసి ఒడిషా రాష్ట్రం గుణుపూర్ నుంచి సికింద్రాబాద్‌కు 60 కేజీల గంజాయిని తరలిస్తుండగా పట్టుకున్నామని విశాఖపట్నం రైల్వే జిఆర్‌పి సిఐ కె.వెంకటరావు తెలిపారు. పలాస రైల్వే జిఆర్‌పి పోలీసుస్టేషన్‌లో శుక్రవారం వారిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. జిఆర్‌పి పోలీసుల వివరాల మేరకు బీహార్ రాష్ట్రం సమిష్టిపూర్ జిల్లాకు చెందిన మహమ్మద్ షంషేర్, మహమ్మద్ షమీమ్ కలిసి ఒడిషా రాష్ట్రం గుణుపూర్‌లో 60 కేజీల గంజాయిని తీసుకువచ్చి పలాస రైల్వేస్టేషన్‌లో అనుమానాస్పదంగా కనిపించడంతో వారి బ్యాగులు తనిఖీ చేస్తుండగా గంజాయి ఉన్నట్లు గుర్తించి గంజాయితో పాటు వారిని అదుపులో తీసుకున్నామని చెప్పారు. దీని విలువ సుమారు రూ.3 లక్షలు ఉంటుందని అంచనా వేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ కె.వెంకటరావు తెలిపారు. ఆయనతో పాటు పలాస ఎస్ఐ షరీఫ్, సిబ్బంది కోదండరావు, ఎం.సంతోష్ కుమార్, బి.దేవేంద్రనాథ్, పి.రమేష్ బాబు, బి.శ్రీనివాసరావు, టి.తేజ ఉన్నారు.

హుండీ ఆదాయం రూ.2.59 లక్షలు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

స్థానిక కొత్తమ్మతల్లి ఆలయ ప్రాంగణంలో గల హుండీలను 42 రోజులకు లెక్కించగా రూ.2.59.001 ఆదాయం, మల్లేశ్వరస్వామి ఆలయ హుండీల నుంచి 502 రోజులకు గాను రూ.87.165 ఆదాయం వచ్చిందని ఆలయ కార్యనిర్వాహాధికారి వాకచర్ల రాధాకృష్ణ శుక్రవారం తెలిపారు. శ్రీకాకుళం దేవాదాయశాఖ సీనియర్ అసిస్టెంట్ జి.వి.బి.ఎస్. రవికుమార్ ఆధ్వర్యంలో ఈ హుండీల లెక్కింపు నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ బోయిన మాధవి, కమిటీ సభ్యులు, బెవర పుణ్యావతి, సకాలభక్తుల తిరుమలరావు, దేవాదాయ సిబ్బంది, ఆలయ అర్చకులు బి.శంకరరావు, పెద్దపాటి లక్ష్మణరావు, యూనియన్ బ్యాంక్ సిబ్బంది, పోలీసులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చిత్రపటాన్ని స్వీకరిస్తున్న హర్షవర్ధన్

అరసవల్లి సందర్శన

శ్రీకాకుళం అర్బన్ : అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయాన్ని ప్రభుత్వ సాంఘిక సంక్షేమశాఖ రాష్ట్ర కార్యదర్శి కె.హర్షవర్ధన్ శుక్రవారం సందర్శించారు. ఆయనకు ఆలయ మర్యాదలతో అర్చకులు స్వాగతించారు. స్వామివారి సేవల్లో పాల్గొన్న అనంతరం అనివేటి మండపంలో ఆయనకు శేష వస్త్రాన్ని కప్పి స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, జూనియర్ అసిస్టెంట్ బి.ఎస్.చక్రవర్తి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సింహాచలం

బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

పెండింగులో ఉన్న కూలిని ఉపాధి కూలీలకు వెంటనే చెల్లించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గంగరాపు సింహాచలం, జిల్లా ఉపాధ్యక్షులు జి.ఈశ్వరమ్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సరుబుజ్జిలి మండల కేంద్రంలో ఉపాధి కూలీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీలకు 5, 6 వారాల నుంచి వేతనాలు చెల్లించకపోవడం సరైన పద్ధతి కాదన్నారు. రెక్కాడితే గాని డొక్కాడని పేద ప్రజలకు వారాల తరబడి వేతనాలు చెల్లించకపోతే వాళ్లు ఎలా జీవిస్తారన్నారు. కేంద్ర ప్రభుత్వం కూలీల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం వలన అధికారులు పూర్తిస్థాయిలో పని కల్పించలేకపోతున్నారని అన్నారు. ఎండల తీవ్రత పెరుగుతుందని, పని ప్రదేశాల్లో మంచినీళ్లు, టెంట్లు, మెడికల్ కిట్లు కల్పించాలన్నారు. సమావేశంలో రాకోటి ఫల్గుణరావు, ఎండ ఆదిలక్ష్మి, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

చికెన్‌సెల్ ఎనీమియాపై అవగాహన

ప్రజాశక్తి- బూర్జ

చికెన్‌సెల్ ఎనీమియా వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని వైద్యాధికారి పావని అన్నారు. శుక్రవారం స్థానిక పిహెచ్‌సిలో ఎంఎల్‌హెచ్‌పిఒలు, ఎఎన్‌ఎంలు, ఆశావర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చికెన్‌సెల్ ఎనీమియా వ్యాధి సోకితే రక్తహీనత, రక్తంలో కణాలు తగ్గడం, కళ్ళు పసుపు రంగులోకి మారడం, ఒళ్లు నొప్పులు వంటి లక్షణాలు కలిగి ఉంటారన్నారు. గిరిజన గ్రామాల్లో ఎక్కువగా వ్యాప్తి చెందుతుందన్నారు. ఈ వ్యాధి పట్ల గిరిజనులకు అవగాహన కల్పించి సకాలంలో వ్యాధి లక్షణాలను గుర్తించి అవసరమైన చికిత్స అందజేయాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సరోజిని పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి- పలాస

మండలం బొడ్డపాడులో శనివారం మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు పలాస కోర్టు ఇన్‌ఛార్జి మెజిస్ట్రేట్ బిఎస్ఆర్ ప్రసన్నలత తెలిపారు. కోటబొమ్మాళి కోర్టులో పలాస న్యాయవాదులతో వైద్యశిబిరం నిర్వహణపై చర్చించారు. జిల్లా న్యాయమూర్తి జువైద్ అహ్మద్ మౌలానా హాజరుకానున్న ఈ శిబిరంలో కిడ్నీవ్యాధులపై క్రియోటివిటి పరీక్షలు చేసి రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. అనంతరం అదే గ్రామంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ వైద్య శిబిరాన్ని స్థానిక ప్రజలతో పాటు పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో పలాస న్యాయవాదులు వాకాడ రవికుమార్, జెఎంఎస్ అనిల్ రాజ్, బి.రవికుమార్ పట్నాయక్, కోర్టు సూపరెండెంట్ పాణిగ్రహి, సిబ్బంది పాల్గొన్నారు.

కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

గ్రామాల్లో పోలీసు కవాతు

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

రానున్న సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా సమస్యాత్మక ప్రాంతాల్లో ఎస్ఐ బి.నిహార్ ఆధ్వర్యంలో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. శుక్రవారం మండలంలోని తెలికిపెంట, కూనజమ్మన్నపేటలో కవాతు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి ప్రతిఒక్కరూ పోలీసులకు సహకరించాలని కోరారు. యువత భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని రాజకీయ వివాదాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో స్థానిక పోలీసులతో పాటు ఆర్‌పిఎఫ్ పోలీసులు పాల్గొన్నారు.

టిడిపిలోకి ఆహ్వానిస్తున్న అచ్చెన్నాయుడు

టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు సమక్షంలో శుక్రవారం టిడిపి కార్యాలయంలో నందిగాం మండలం మద్దిలోడుపేటకు చెందిన వైసిపి కార్యకర్తలు, నాయకులు టిడిపిలో చేరారు. వీరికి అచ్చెన్నాయుడు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో కొంకి సింహాచలం, కొంకి శ్రీరాములు, త్యాగారావు, సత్యంతో పాటు 20 కుటుంబాలు టిడిపి చేరారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు పినకాన అజయ్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా 'కెరీర్ డే'

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

మండలం కురుడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులు, ఉపాధ్యాయులు కెరీర్ డే ఘనంగా నిర్వహించారు. ఏపి ప్రభుత్వం, యూనిసెఫ్ సౌజన్యంతో కోటబొమ్మాళి, పోలాకి, లావేరు మండలాల్లో ఈ విద్యా సంవత్సరంలో 9వ తరగతికి కెరీర్ గైడెన్స్‌పై విద్యార్థులకు వివిధ మనోపావన పరీక్షలు నిర్వహించి వారు సరైన కెరీర్‌ను ఎంచుకోవడానికి పైలెట్ ప్రాజెక్టును ప్రారంభించింది. ఇందులో భాగంగా మండలం కొత్తపల్లి జిల్లాపరిషత్ పాఠశాల 9వ తరగతి విద్యార్థులు 'కెరీర్ డే' ను నిర్వహించారు. విద్యార్థులు పలు వేషాధారణలతో మెప్పించారు. హెచ్ఎం సోమేశ్వరరావు, గైడ్ టీచర్ షణ్ముఖ, ఉపాధ్యాయులు గోవిందరావు, రాము, గౌరి, నాయుడు, దామోదరరావు పాల్గొన్నారు.

రవాణాశాఖ చెక్‌పోస్టు ఎత్తివేత

ఎత్తివేసిన రవాణాశాఖ చెక్‌పోస్టు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం సరిహద్దులో పురుషోత్తం పురం వద్ద ఉన్న రవాణాశాఖ చెక్‌పోస్టును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాలతో ఎత్తి వేశారు. గతంలో 2017లో దేశవ్యాప్తంగా జిఎస్‌టి అమల్లోకి వచ్చిన తరువాత సరిహద్దు చెక్‌పోస్టులు ఎత్తివేశారు. ఉమ్మడి తనిఖీ కేంద్రంగా ఉన్న సమయంలో వాణిజ్య పన్నుల శాఖ, రవాణా, సివిల్ సప్లయ్, అటవీశాఖ, ఎక్సైజ్‌శాఖ ఉమ్మడిగా ఉండే చెక్‌పోస్టు మొదట్లో పూర్తిగా ఎత్తివేశారు. 2019 తరవాత ప్రభుత్వ ఆదేశాలతో కేవలం రవాణా శాఖ మాత్రమే సరిహద్దులో వాహనాల తనిఖీ కేంద్రం ప్రారంభం చేసింది. రవాణా శాఖలో క్యాష్ లెస్ కార్యకలాపాలు రావడం, ఆన్‌లైన్ విధానం పెరగడంతో తాజాగా రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సరిహద్దులో రవాణా చెక్ పోస్టులు ఎత్తివేస్తు ఉత్తర్వులు వెలువడ్డాయి. బుధవారం జిల్లా కలెక్టర్ పర్యటనలో భాగంగా సరిహద్దు ప్రాంతంలో ఎన్నికల నేపథ్యంలో ప్రత్యేక తనిఖీ కేంద్రం ఏర్పాటు చేశారు.. దీనిని పరిశీలించేందుకు వచ్చిన జిల్లా కలెక్టర్‌కు స్థానిక మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్ రెడ్డి చెక్‌పోస్ట్ ఎత్తివేసినట్లు తెలిపారు. ప్రస్తుతం కేవలం ఎన్నికల చెక్‌పోస్ట్ కొనసాగుతుంది.

చీకటి ఒప్పందాలను బయట పెడతా

ఇంటింటా ప్రచారం చేస్తున్న గాంధీ

బూర్జ : మామ, అల్లుళ్ల చీకటి ఒప్పందాలను ఆధారాలతో సహా తొందరలోనే బయట పెడతానని స్వతంత్ర అభ్యర్థి సువ్వారి గాంధీ అన్నారు. శుక్రవారం బూర్జలో ఇంటింటా ప్రచారాన్ని చేపట్టారు. ఇంటింటికి వెళ్లి రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తనకు ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మామ, అల్లుళ్లను గెలిపించినంత కాలం నియోజకవర్గ అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంటుందన్నారు. కొత్తగా పోటీ చేస్తున్న తనలాంటి వ్యక్తులకు అవకాశం కల్పించి నియోజకవర్గ అభివృద్ధికి మద్దతు పలకాలని కోరారు. కార్యక్రమంలో అనిల్ కుమార్, ప్రశాంత్, మోహన్ చౌదరి, ఆదినారాయణ, రవి, బాగాది మోహన్, గోపాల్, జనార్దన్, జగ్గుపల్లి మధు, తులసి, నాయకులు పాల్గొన్నారు.

ఆశీల వేలం పాటకు బాక్స్ టెండర్లు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మున్సిపాలిటీ పరిధిలో వివిధ రకాల పన్నులు వసూలు చేసుకునేందుకు వీలుగా ఆశీల వేలం పాటను శుక్రవారం బాక్స్ టెండర్లు దాఖలు చేశారని మున్సిపల్ కమిషనర్ రమేష్ తెలిపారు. ఇప్పటికే రెండుసార్లు బహిరంగ వేలం పాట నిర్వహించినా వచ్చిన వేలం పాటలు ఆదాయం తక్కువ కావడంతో వరుసగా వాయిదా పడింది. కౌన్సిల్ సూచనల మేరకు మూడోసారి మున్సిపల్ చట్టం ప్రకారం బాక్స్ టెండర్లు దాఖలు చేయాల్సి ఉందన్నారు. అందులో భాగంగా శుక్రవారం బాక్స్ టెండర్లకు నలుగురు పోటీ పడ్డారన్నారు. 2024-2025 సంవత్సరానికి పురపాలక సంఘం రోజువారీ మార్కెట్, వీధిగుత్తల ఆశీలు వసూలు చేసుకొనే హక్కునకు పాటదారుడు దాట్ల నూకమ్మ 30,50,555 దాఖలు చేసినట్లు తెలిపారు. గతేడాది రూ.28,90,000 కాగా ఈ ఏడాది రూ.1,60,555 అధికంగా వచ్చినట్లు తెలిపారు. ఈ బాక్స్ టెండర్లు ఖరారుపై కౌన్సెల్ సమావేశంలో ప్రవేశ పెట్టడం జరుగుతుందన్నారు.

న్యాయ విభాగంలో 'ఫ్రెషర్స్ డే'

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

బి.ఆర్.అంబేద్కర్ విశ్వవిద్యాలయం న్యాయ విభాగపు 'ఫ్రెషర్స్ డే' కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి వర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య కె.ఆర్.రజిని హాజరై మాట్లాడుతూ న్యాయవిద్య పూర్తి చేసిన తరువాత ఎంచుకున్న కెరీర్‌తో నిజాయితీగా, సమాజానికి ఉపయోగపడేలా వ్యవహరించి న్యాయ వ్యవస్థకు, విశ్వవిద్యాలయానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. విలువలతో కూడిన పయనాన్ని కొనసాగించి భావితరాలకు స్ఫూర్తిగా నిలవాలన్నారు. కార్యక్రమంలో వర్సిటీ రెక్టర్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య బి.అడ్డయ్య, రిజిస్ట్రార్ ఆచార్య పి.సుజాత, న్యాయ విభాగాధిపతి డా.వై.రాజేంద్రప్రసాద్ తదితరులు మాట్లాడారు. న్యాయ విభాగపు అధ్యాపకులు. డా. జె.కె.ఎల్. సుజాత, డా.జి.జయలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వి.సి.ఆచార్య కె.ఆర్. రజినిను న్యాయ విభాగపు అధ్యాపకులు, విద్యార్థులు ఘనంగా సత్కరించారు.

వీసిని సత్కరిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి- టెక్కలి

మారుతున్న కాలానికి అనుగుణంగా సైబర్ నేరాలు పెరుగుతున్నాయని వీటిని అరికట్టే క్రమంలో ప్రతిఒక్క విద్యార్థికి అవగాహన అవసరమని స్థానిక ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల ప్రొఫెసర్ వై.రమేష్ అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల మూడవ జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో గ్రామంలో నిర్వహిస్తున్న సేవా శిబిరంలో శుక్రవారం పాల్గొని ఆయన విద్యార్థులకు అవగాహన కల్పించారు. మొబైల్ ఫోన్ వినియోగం, సైబర్ సెక్యూరిటీ, వైరస్ లింకులు వంటి వాటిపై అవగాహన కల్పించారు. అనంతరం సేవా పథకం విద్యార్థులు సెంద్రీయ ఎరువుల వాడకంపై నినాదాలు చేస్తూ ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో పిఒ డి.వాసుబాబు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబూరు గోవిందమ్మ, కో-ఆర్డినేటర్ లుక్ పాల్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బేపల సతీష్ కుమార్, వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

దీక్షల్లో పాల్గొన్న దొలాయిపుట్టుగ గ్రామస్తులు

86వ రోజుకు దీక్షలు

ప్రజాశక్తి- కవిటి

తమ బిడ్డల ఉన్నత చదువులు, యువతీ యువకుల ఉద్యోగాన్వేషణ కోసం కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాల్సిందేనని బెంతుఒరియాలు స్పష్టం చేశారు. అంతవరకు తమ పోరాటం ఆగదని హెచ్చరించారు. బెంతు ఒరియాలు కవిటిలో చేస్తున్న రిలే నిరాహారదీక్షలు 86వ రోజుకు చేరుకున్నాయి. శుక్రవారం దీక్షలో దొలాయిపుట్టుగ గ్రామస్తులు పాల్గొని తమ సంఘీభావం తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ బెంతు ఒరియాలు ప్రభుత్వ పథకాలకు దూరమవుతున్నారని, గుర్తింపు, భవిష్యత్‌కు భరోసా దక్కేవరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రూపచంద్ర దొలాయి, మార్కండ్ సాహు పాల్గొన్నారు.

గ్రామాల్లో పర్యటిస్తున్న ఎంపిడిఒ రమణమూర్తి, సిబ్బంది

గ్రామాల్లో విస్తృతంగా తనిఖీలు

ప్రజాశక్తి- రణస్థలం

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో రాజకీయ ప్రచార చిత్రాలు, పోస్టర్లు ఉండకూడదని ఎంపిడిఒ ఆర్.వి.రమణమూర్తి తెలిపారు. పాతర్లపల్లె, కోటపాలెం, అల్లివలస పంచాయతీల పరిధిలో శుక్రవారం విస్తృతంగా తనిఖీలు చేశారు. గ్రామాల్లో ఇంటింటికీ అంటించిన ప్రభుత్వ, ప్రతిపక్షాల ప్రచార పోస్టర్లను తొలగించారు. అలాగే పోలింగ్ కేంద్రాలను, మౌలిక వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరు తమ ఓటుహక్కును వినియోగించు కోవాలన్నారు. ఈయనతో పాటు జూనియర్ అసిస్టెంట్ భానుప్రకాష్, పి.సీతయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

లస్సీ పంపిణీ చేస్తున్న యువత

లస్సీ పంపిణీ

కవిటి : పదో తరగతి పబ్లిక్ పరీక్షల సమయంలో ఎండ తీవ్రత దృష్ట్యా గత మూడు రోజులుగా బొరివంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద గ్రామ యువత పలు రకాల పానీయాలు పంపిణీ చేస్తోంది. శుక్రవారం కెఎంఆర్ ఫైనాన్స్ యజమాని కె.మన్మధరావు ఆర్థికసాయంతో సుమారు 350 మంది విద్యార్థులకు లస్సీ పంపిణీ చేశారు. అనంతరం గ్రామ యువత మాట్లాడుతూ దాతల సహకారంతో పదో తరగతి పరీక్షలు పూర్తయ్యే వరకూ ఈ కార్యక్రమం కొనసాగిస్తామని తెలిపారు.

కాలువలు నిర్మించాలి

రణస్థలం: మండలం జె.ఆర్.పురం గ్రామ పంచాయతీ గొల్లవీధిలో మురుగునీరు వెళ్లేందుకు అవకాశం లేక రోడ్డుపైన మురుగునీరు నిల్వ ఉండిపోతుంది. దీంతో అక్కడి ప్రజలు దోమలతో పాటు దుర్వాసనతో అవస్థలు పడుతున్నారు. అధికారులకు, ప్రజా ప్రతినిధులకు విన్నవించుకున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి మురుగునీరు బయటకు వెళ్లేలా చర్యలు చేపట్టి కాలువలు నిర్మించాలని కోరుతున్నారు.